క్లుప్తంగా

వేడుకగా పల్లకీ సేవ



చిల్లకూరు: మండలంలోని కలవకొండలో ఉన్న లక్ష్మీనరసింహస్వామివారికి శనివారం పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ఉదయం పలు అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. అలాగే తమ్మినపట్నంలో కోదండరామస్వామివారికి పల్లకీ సేవ చేశారు. ఈ కార్యక్రమాలను ఈఓలు తాతా శ్రీనివాసరావు, జానకి పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా భక్త బృందాల సభ్యులు ఏర్పాట్లు చేశారు.

హెచ్ఐవీపై అవగాహన

దొరవారిసత్రం: నెలబల్లిలో శనివారం జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం సహకారంతో నవజీవన్ సీసీ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై కళాజాత బృందం సభ్యులు నాటకాలు, పాటల ద్వారా ఎయిడ్స్, హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. ప్రాజెక్ట్ మేనేజర్ బాలాజీ, సభ్యులు ఐశ్వర్య, నాగార్జునమ్మ, రెడ్డెప్ప, గురుప్ప, నారాయణ పాల్గొన్నారు.

పరిహారం చెల్లింపుపై దృష్టి

పెళ్లకూరు: జాతీయ రహదారి విస్తరణలో భూములు, ఇళ్లు, ఇళ్ల స్థలాలు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ప్రసాద్‌రావు అన్నారు. శనివారం చిల్లకూరు, దిగువచావలి, తాళ్వాయిపాడు గ్రామాల్లో పలు ప్రాంతాలను మెగా కంపెనీ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.

సెప్టిక్ ట్యాంకు సిబ్బందిపై ఫిర్యాదు

దొరవారిసత్రం: పడమటికండ్రిగ గ్రామ సమీపంలోని చెన్నకేశవులస్వామి గుడి వద్ద శనివారం సెప్టిక్ ట్యాంక్‌లోని వ్యర్థాలను వదులుతున్న సమయంలో స్థానికులు గుర్తించి అడ్డుకున్నారు. దీంతో స్థానికులు, ట్యాంకు సిబ్బంది మధ్య వివాదం ఏర్పడింది. దీనిపై పలువులు గ్రామస్తులు దొరవారిసత్రం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారించి, చర్యలు చేపడతామని ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

వాహనాల తనిఖీ

దొరవారిసత్రం: జాతీయ రహదారిపై, నేలపట్టు గ్రామం వెళ్లే మార్గంలో శనివారం స్థానిక ఎస్‌ఐ తిరుమలరావు వాహనాలను తనిఖీ చేశారు. రికార్డులను సక్రమంగా లేని ఆటోలు, ద్విచక్రవాహనాలకు జరిమాన విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. వాహనాలకు రికార్డులు లేకపోతే జరిమానా విధించడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

యథావిధిగా బిల్లుల కేంద్రాలు

వెంకటగిరిరూరల్: వినియోగదారులు విద్యుత్ బిల్లులు చెల్లించడానికి అనువుగా ఆదివారం కూడా విద్యుత్ బిల్లుల చెల్లింపు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని ట్రాన్స్‌కో డీఈఈ మునిచంద్ర శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రుచికరంగా ఉండాలి

గూడూరురూరల్: పేద విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా అందించే భోజనం రుచిగా ఉండేలా చూడాలని ఎంఈఓ–2 కాంచన సూచించారు. పట్టణంలోని సీఎస్ఎం ఉన్నత పాఠశాలలో శనివారం మధ్యాహ్నం భోజనాన్ని ఆమె తనిఖీ చేసి, రుచి చూశారు.

జాబితాలు సరిచేసుకోవాలి

నాయుడుపేట: ఓటర్ల జాబితాల్లో ఎక్కడ పొరపాట్లు లేకుండా పక్కాగా సరిచేసుకోవాలని తహశీల్దార్ కే కళ్యాణి సూచించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో శనివారం బీఎల్వోలతో సమీక్షించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు ఉండేలా చూడాలన్నారు. ఎక్కడైన సమస్యలుంటే ముందుగానే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం సాంఘిక సంక్షేమ శాఖ భవనాన్ని సీఐ శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు.

మంచి ఫలితాలు సాధించాలి

గూడూరురూరల్: పది పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని విందూరు జెడ్పీ హైస్కూలు హెచ్ఎం వెంకటనాగమల్లికార్జునరావు సూచించారు. పాఠశాలలో పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు పూర్వ విద్యార్థి మోమిడి మల్లికార్జున దాతృత్వంతో పరీక్షలు ప్యాడ్లు, జామిట్రీ బాక్సులు, పెన్నులు పంపిణీ చేశారు. ప్రవీణ్ గురు, సర్పంచ్ మస్తానయ్య పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

గూడూరురూరల్: ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలని రూరల్ ఎస్ఐ మనోజ్‌కుమార్ సూచించారు. డీఆర్‌డబ్ల్యూ కళాశాలలో విద్యార్థులకు ఓటుహక్కుపై శనివారం ప్రజాసత్తా ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటుహక్కు అన్నారు. ప్రజాసత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు పీ శోభన్‌బాబు న్యాయవాది ఏ పార్వతయ్య, వెంకటరమణయ్య, పుష్ప, కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

ఏపీఐఐసీ భూముల పరిశీలన

కోట: కొత్తపట్నం పంచాయతీలో ఏపీఐఐసీ ద్వారా పరిశ్రమలకు కేటాయించిన భూములను శనివారం తిరుపతి జేసీ శుభమ్ బన్సాల్, ఆర్డీఓ కిరణ్‌కుమార్ పరిశీలించారు. ఏపీఐఐసీకి భూములిచ్చిన రైతులతో మాట్లాడారు. రైతులకు త్వరలోనే పరిహారం అందేలా చూస్తామన్నారు. సర్పంచ్ తిరుపాలయ్య, ఉపసర్పంచ్ ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆశావహుల్లో నిరుత్సాహం

- షాక్‌లో వేనాటి వర్గం
- నియోజకవర్గ టీడీపీలో అయోమయం



వేనాటి రామచంద్రారెడ్డి



పరసా వెంకటరత్నం

సూళ్లూరుపేట: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె నెలవల విజయశ్రీని ఆ పార్టీ అధిష్టానం ప్రకటించింది. దీంతో ఆ పార్టీ ఆశావహుల్లో నిరుత్సాహం నెలకొంది. నియోజకవర్గ టీడీపీలో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. ఏడోసారి కూడా టికెట్ ఆశించిన మాజీ మంత్రి పరసా వెంకటరత్నం భంగపడ్డారు. ఐవీఆర్ సర్వేలో శ్రీపతిబాబు పేరు ప్రస్తావించడంతో ఆయన కూడా టికెట్ ఆశించి భంగపడ్డారు. ఇదంతా ఒక ఎత్తయితే పనబాక కృష్ణయ్య పేరు కూడా బాగా వినిపించినప్పటికీ ఆ పార్టీ నాయకుడు చంద్రబాబు అందరికీ ఝలక్ ఇస్తూ నెలవల విజయశ్రీని అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీలో విభేదా లు భగ్గుమంటున్నాయి. టీడీపీ కార్యాలయం వద్ద చేసుకున్న సంబరాల్లో వేనాటి వర్గం లేకపోవడంతో వేనాటి లేకుండా ఈ కార్యక్రమం ఏమిటని పార్టీ శ్రేణులు చర్చించు కోవడం విశేషం.

వేనాటి వారికి సమాచారం లేకుండానే..

సూళ్లూరుపేట టీడీపీలో చక్రం తిప్పుతూ వచ్చిన వేనాటి వారికి ఎలాంటి సమాచారం లేకుండా నెలవల విజయశ్రీకి టికెట్ ప్రకటించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి వేనాటి మునిరెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, ఆ తరువాత వారి కుమారుడు వేనాటి సతీష్‌రెడ్డి సూళ్లూరుపేటలో చక్రం తిప్పుతూ వచ్చారు. గత 40 ఏళ్ల నుంచి వేనాటి వారు చెప్పిన వారికే సూళ్లూరుపేట ఎమ్మెల్యే టికెట్ ఇచ్చేవారు. అలాంటిది ఈసారి వేనాటి వారికి తెలియకుండానే చంద్రబాబు నెలవల కుమార్తెకు టికెట్ ప్రకటించారని కినుక వహించినట్టుగా తెలుస్తోంది. నెలవల పేరు ప్రకటించగానే టీడీపీ కార్యాలయం వద్ద బాణాసంచా కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఆ సమయంలో వేనాటి వర్గం అక్కడ లేకపోవడంతో అందరూ ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు. నెలవల సుబ్రమణ్యానికి నియోజకర్గ ఇన్‌చార్జిగా ఇచ్చినపుడు వేనాటి వారు సమర్థించారు. ఆ తరువాత ఏం జరిగిందో కాని నెలవలకు టికెట్ వద్దని వేనాటి వారు చెబుతూవస్తున్నారు. ముఖ్యంగా సూళ్లూరుపేట ఎమ్మెల్యే అభ్యర్థిని ప్రకటించే సమయంలో సీనియర్ నేత వేనాటి రామచంద్రారెడ్డికి ఒక మాట చెప్పకుండా చేయడంతో ఆయన కూడా కినుక వహించారు. సూళ్లూరుపేట నియోజకవర్గ రాజకీయాల్లో వేనాటి వారి ప్రాధాన్యతను తగ్గించాలని కొండేపాటి గంగా ప్రసాద్ ఆది నుంచి ప్రయత్నాలు చేస్తూ చక్రం తిప్పుతున్నారు. చంద్రబాబు, కొండేపాటి ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కావడంతో రెడ్డి సామాజిక వర్గాన్ని తగ్గిస్తూ వేనాటి వారిని కూడా తగ్గించాలనే ప్రయత్నాల్లో ఇదంతా చేసినట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి, శ్రీకాళహస్తి నియోజకవర్గాల బాధ్యతను కొండేపాటికి అప్పగించారనే ప్రచారం జరుగుతోంది. చంద్రబాబు కుటిల రాజకీయాలు చేయడంలో దిట్ట కావడంతో సూళ్లూరుపేట నియోజకవర్గంలో వేనాటి వారిని తగ్గించి కొండేపాటికి ప్రాధాన్యత కల్పిస్తున్నట్టుగా ఉందీ పరిస్థితి.

పాపం పరసా..

మరోవైపు పరసా వెంకటరత్నయ్య కూడా 1994 నుంచి ఆపార్టీలోనే ఉంటూ చంద్రబాబుకు విధేయుడిగా ఉంటున్నారు. 1994 నుంచి 2019 వరకు ఆరుసార్లు టికెట్ తెచ్చుకుని మూడుసార్లు గెలిచి మూడుసార్లు ఓడిపోయారు. చిత్తూరు జిల్లాలో పరసా కుటుంబసభ్యులు చంద్రబాబు ఆస్తులకు బినామీ కావడంతో ఆరుసార్లు టికెట్ ఇచ్చారనే ప్రచారం అప్పట్లో జరిగింది. అయితే ఈ సారి కూడా టికెట్ కోసం ఆయన అన్ని ప్రయత్నాలు చేశారు. ఇస్తే తనకు లేదంటే తన అల్లుడు సతీష్‌చంద్రకైనా టికెట్ ఇవ్వాలని కోరారు. 30 ఏళ్ల నుంచి పార్టీని నమ్ముకుని ఉన్నందుకు చంద్రబాబు పరసాకు సరైన గిఫ్ట్ ఇచ్చారని ఆయన వర్గీయులు అంటున్నారు. నెలవల సుబ్రమణ్యం, పరసా రత్నం సమీప బంధువులైనప్పటికీ వీరిద్దరు కడుపులో కత్తులు పెట్టుకుని కౌగిలించుకుంటుంటారు. పైకి బావా.. బావా అంటూనే లోలోపల ఇద్దరూ ప్రత్యర్థులు మాదిరిగానే ప్రవర్తిస్తుంటారు. మొన్నటికి మొన్న పార్టీలో చేరిన నెలవలను నియోజకవర్గ ఇన్‌చార్జి చేశారు. ఇప్పుడేమో నెలవల కుమార్తెకు టికెట్ ఇచ్చారు కదా! మరి నాకు కూడా కుమార్తె ఉంది. తన అల్లుడికి అడిగాను కదా! మరి ఇవ్వకుండా నెలవలకు చంద్రబాబు ప్రాధాన్యత ఇవ్వడంతో పరసా పైకి బాగున్నా లోలోపల రగిలిపోతున్నాడని ఆయన వర్గీయులు అంటున్నారు. కాగా సూళ్లూరుపేట నియోజకవర్గ చరిత్రలో ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ మహిళా అభ్యర్థులుగా ఒకసారి మైలారి లక్ష్మీకాంతమ్మ, రెండోసారి విన్నమాల సరస్వతిని ప్రకటించింది. ఆ ఇద్దరూ ఓటమి పాలయ్యారు. టీడీపీ ఆవిర్భావం తరువాత మొదటిసారి మహిళా అభ్యర్థిని ప్రకటించారు. ఈ నియోజకవర్గానికి మహిళా అభ్యర్థులు అచ్చి రాలేదని, ఈ సారి కూడా మహిళా అభ్యర్థి ఓటమి పాలవుతుందని సెంటిమెంట్ వర్క్ అవుతుందేమో మరి.

ఘనంగా క్షీరాభిషేకం..మహాచండీయాగం



చెంగాళమ్మ ఆలయంలో 108 క్షీరకలశాలకు పూజలు చేస్తున్న అర్చకులు

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం క్షీరాభిషేకం, మహాచండీయాగం ఘనంగా నిర్వహించారు. ఆలయ సహాయక కమిషనర్ అండ్ కార్యనిర్వహణాధికారి డీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 108 క్షీర కలశాలను అమ్మవారి ఆలయంలో ప్రతిష్ఠించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అష్టోత్తర క్షీరకలశాల ప్రాకారోత్సవం నిర్వహించి, అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయంలో మహా చండీయాగం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీ రామ్‌కుమార్, శ్రీలక్ష్మి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వెండి వస్తువులు బహూకరణ

యూఎస్ఏకి చెందిన సింధూర, ఉదయశంకర్ దంపతులు 1.40 కిలోల బరువున్న వెండి కలశం చెంబు, నెల్లూరుకు చెందిన వీ రాజేశ్వరప్రసాద్ 129 గ్రాముల వెండి తీర్థం గిన్నెలు రెండు, ఏసీ వెంకటేశ్వర్లుకు అందజేశారు. అలాగే ఒంగోలుకు చెందిన వై గురురత్న సాయికుమార్ కుటుంబసభ్యులు రూ.41,116 నగదు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్, ఓలేటి బాలసత్యనారాయణ, కర్లపూడి సురేష్, బండి సునీత, పెనుబేటి మారెమ్మ, ముంగర అమరావతి పాల్గొన్నారు.

బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మాదాసు గంగాధరం

కలువాయి: మండలంలోని వెంకటరామరాజుపేట వద్ద నిర్మిస్తున్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ నేత మాదాసు గంగాధరం శనివారం అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీఎంగా ఉన్న సమయంలో రిజర్వాయర్ పనులు ప్రారంభమయ్యాయన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక పనులు వేగవంతం అయ్యాయని తెలిపారు. డీఈ శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. వారి వెంట కుల్లూరు ఉపసర్పంచ్ పి.శ్రీనివాసులు ఉన్నారు.

ఎమ్మెల్యే కిలివేటికి పలువురి పరామర్శ



ఎమ్మెల్యే కిలివేటిని పరామర్శిస్తున్న మంత్రి కాకాణి

తడ: ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తల్లి మస్తానమ్మ రెండురోజుల కిందట మృతి చెందిన నేపథ్యంలో పలువురు నాయకులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కిలివేటిని, ఆయన కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్నారు. ఎమ్మెల్యే కిలివేటిని పరామర్శించిన వారిలో వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, నెల్లూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

వైభవంగా పుష్పయాగం



పుష్పయాగం చేస్తున్న అర్చకులు



పూలు తీసుకువస్తున్న ఆలయాధికారులు

రాపూరు: మండలంలోని పెంచలకోనలో ఉన్న పెనుశిల లక్ష్మీనరసింహస్వామివారికి మాఘ పౌర్ణమి సందర్భంగా శనివారం రాత్రి పుష్పయాగం వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని స్వామివారి నిత్యాకల్యాణ మండపంలో లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి, వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలతో శోభాయమానంగా అలంకరించారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ దేవదేవేరులకు 350 కిలోల 20 రకాల పుష్పాలతో పుష్పయాగం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి జరిపి, స్వామి అమ్మవార్లను కోన మాడ వీధుల్లో ఊరేగించారు. ఉదయం స్వామి అమ్మవార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. స్వామివారి పుష్పయాగం తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ప్రధానార్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్యస్వామి, ఆలయ డీసీ సాగర్‌బాబు, అర్చకులు శశిస్వామి, వినోద్‌స్వామి, బాలాజీ స్వామి, నాగరాజస్వామి, ఉభయకర్తలు మద్దిశెట్టి చిరంజీవి, దేవసేన పాల్గొన్నారు.

ఆయకట్టు రైతులను కాపాడండి

వాకాడు: చిట్టమూరు మండలం బయ్యావారికండ్రిగ చెరువు ఆయకట్టు రైతులను కాపాడాలని బీజేపీ నేత పీ కోటేశ్వరరావు శనివారం వాకాడులోని ఇరిగేషన్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు డీఈ సుబ్బారావుకు వినతి పత్రం అందజేశారు. కోటేశ్వరరావు మాట్లాడుతూ కొందరు చెరువును ఆక్రమించుకుని, కలుజును ధ్వంసం చేశారన్నారు. ఆక్రమణలను తొలగించాలని కోరారు.

కండలేరులో 10.463 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో శనివారం నాటికి 10.463 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకాలువకు 480 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, హైలెవల్ కాలువకు 105, లోలెవల్ కాలువకు 210 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సైదాపురం: ప్రభుత్వం అమలు సంక్షేమ పథకాలను అర్హులందరికీ పారదర్శకంగా అందించాలని ఏఓ పురుషోత్తం శివకుమార్ సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు సూచించారు. మండలంలోని లింగసముద్రం, అనంతమడుగు, పాలూరు, వేములచేడు సచివాలయాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం గ్రామాభివృద్ధిపై సిబ్బంది, వలంటీర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వలంటీర్ల వ్యవస్థను ప్రవేశపెట్టిందన్నారు. ప్రజలకు అధికారులకు వలంటీర్లు వారధిలాంటివారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు సకాలంలో అందించాలన్నారు.

మానవాళి శాంతికి చండీయాగం



పూర్ణాహుతి సమర్పిస్తున్న వేద పండితులు

చిల్లకూరు: మానవాళి శాంతి కోసం చండీయాగం చేస్తున్నట్లు ముత్యాలమ్మ ఆలయ ట్రస్టు బోర్డు చైర్‌పర్సన్ సీ ఇంద్రసేనమ్మ తెలిపారు. మండలంలోని తూర్పుకనుపూరులో ఉన్న ముత్యాలమ్మ ఆలయం ఆవరణలో పౌర్ణమి సందర్భంగా చండీయాగం నిర్వహించారు. ఈ సందర్భంగా నవ కలశస్థాపన చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసబాబు, ఆలయ ఈఓ నవీన్‌కుమార్, ధర్మకర్త మండలి సభ్యులు డీ చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

నకిలీల అరికట్టడానికే శాంపిళ్ల సేకరణ

చిల్లకూరు: రసాయన ఎరువుల్లో నకిలీలను అరికట్టడానికే ప్రభుత్వం ప్రతి రైతు డిపోలో ఎరువుల శాంపిళ్లు సేకరించి, ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయిస్తుందని ఏఓ గూడూరు భవాని తెలిపారు. మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో శనివారం ఎరువుల డిపో నుంచి తీసుకుని వచ్చిన శాంపిళ్లను ల్యాబ్‌కు పంపే ఏర్పాట్లు చేశారు. ఆమె మాట్లాడుతూ డిపోల్లో విక్రయించే ఎరువులు నాణ్యతా ప్రమాణాలున్నా? లేదా అనే విషయాలను గుర్తించేలా ప్రభుత్వం ద్వారా ల్యాబ్‌లకు పంపి వాటిని పరీక్షిస్తుందన్నారు. మండలంలోని 9 ఎరువుల దుకాణాల నుంచి శ్యాంపిళ్లు తీసుకుని వాటిని విశాఖపట్నం, విజయవాడ, తిరుపతిలోని ల్యాబ్‌లకు పంపే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

సైదాపురం: మండలంలోని పోలింగ్ కేంద్రాలు శనివారం ఏఓ పురుషోత్తం శివకుమార్ పరిశీలించారు. మండలంలోని లింగసముద్రం, అనంతమడుగు, పాలూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులను సమకూర్చుతున్నట్లు చెప్పారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

వాకాడు: మండలంలో మార్చి 3, 4, 5 తేదీల్లో నిర్వహించనున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ తోట గోపీనాథ్ ఆదేశించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు పల్స్‌పోలియో నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ తమ పరిధిలో ఏర్పాటు చేసిన పల్స్‌పోలియో కేంద్రాల్లో 0 నుంచి 5 ఏళ్ల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. ముందుగానే గ్రామాల్లో ర్యాలీలు చేసి, అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో నూరు శాతం పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి పాదాల ప్రతిష్ట



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

నాయుడుపేటటౌన్: తుమ్మూరులోని శ్రీదేవి భూదేవి సమేత కరిమాణిక్యస్వామి ఆలయం వద్ద శనివారం శ్రీవారి పాదాల ప్రతిష్ట భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హిమాలయాల్లో తపస్సు చేసుకునే శంబలనగరి మహర్షులు తపశ్శక్తి నింపిన పంచలోహ పాదాల ప్రతిష్ట కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నిర్వహించిన సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. వందలాది మంది దంపతులు పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భక్తులకు అన్న ప్రసాదాలు పంపిణీ చేశారు. టీటీడీ ఇన్‌స్పెక్టర్ హరిరెడ్డి, నిర్వాహకులు జనార్దన్, బాబీ పాల్గొన్నారు.